క్లుప్తంగా

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయకపోతే ఎలా ?



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

సి.బెళగల్: ప్రభుత్వం, ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయపోతే ఎలా అని గ్రామ సచివాలయ ఉద్యోగులను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు ప్రశ్నించారు. శనివారం ఆయన ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి మండల కేంద్రం సి.బెళగల్‌లోని గ్రామ సచివాలయాలు – 1, 2లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ సర్వే, యాప్ ఇన్‌స్టాల్, సంక్షేమ పథకాల అమలుపై ఉద్యోగులతో సమీక్షించారు. సచివాలయాల్లో పనులను పురోగతి లేకపోవడంపై ఎంపీడీఓ ఉద్యోగులపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో చేర్చేందుకు ఉద్యోగులు కృషి చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు బలపనూరులో గడపగడపకు మన ప్రభుత్వం

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో నేడు గడపగడపకు–మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి శనివారం తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరు కావాలన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరిస్తారన్నారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు గుర్తించండి



మాట్లాడుతున్న ఏపీఓ వెంకటరమణ

గడివేముల: ఉపాధి హామీ పథకం కింద చేపట్టేందుకు రైతులకు, ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏపీఓ వెంకటరమణ అన్నారు. శనివారం గ్రామీణ ఉపాధిహామీ కార్యాలయంలో ఉద్యాన రైతులు, ఫీల్డ్ అసిస్టెంట్లలతో ఆయన సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టే వారు తమ పేర్లను ఆయా గ్రామాల్లోని ఫీల్డ్‌అసిస్టెంట్లకు అందజేయాలన్నారు. అలాగే జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పనులు చూపిస్తామన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి నరేంద్రారెడ్డి, టీఏ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వార్షిక తనిఖీ



నాయకల్లు పాఠశాలలో వార్షిక తనిఖీ చేస్తున్న ఎంఈఓలు

కల్లూరు: మండల పరిధిలోని నాయకల్లు గ్రామం పాఠశాలలో ఎంఈఓ–1 శ్రీనివాసులు, ఎంఈఓ–2 వనజ కుమారి ఆధ్వర్యంలో శనివారం సీనియర్ ఉపాధ్యాయులు వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, రిజిస్టర్లు, రికార్డులు, వంట గదితో పాటు విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, ఉపాధ్యాయులు బోధన పద్ధతులను పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థమయ్యేరీతిలో బోధించాలన్నారు. జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ, పాఠశాల నిధుల వినియోగం, ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులు తదిర వాటికి సంబంధించిన రికార్డులు తనిఖీ చేసినట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు.

ఉపాధి పనులపై గ్రామ సభలు

కల్లూరు:జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై వచ్చే నెల నుంచి గ్రామ సభలు నిర్వహించనుననట్లు ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఏపీడీ లక్ష్మన్న, అసిస్టెంట్ డీవీఓ ఆదినారాయణ తెలిపారు. 2022–2023 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులపై శనివారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వచ్చే నెల 9న మండల స్థాయిలో ఓపెన్ ఫోరమ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి, కోర్టు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏపీఓ మద్దేశ్వరమ్మ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

కల్లూరు: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో వచ్చే నెల 8న నిర్వహించే రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎస్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఏ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కల్లూరులోని సూర్య నారాయణ భవన్‌లో వివిధ సంఘాల ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, ఏఐఎస్ఏ జిల్లా సహాయ కార్యదర్శి పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులకు జగనన్న సముచిత స్థానం

- మేయర్ బీవై.రామయ్య, ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్





కోడుమూరులో వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే సుధాకర్, గూడూరులోని వాల్మీకి దేవాలయంలో..

కోడుమూరు రూరల్ : రాష్ట్రంలో వాల్మీకులకు సముచిత స్థానం కల్పించి అత్యున్నత పదవులు కట్టబెట్టిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య తెలిపారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని శనివారం కోడుమూరులో వాల్మీకి మహర్షి విగ్రహానికి కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ యావత్తు ప్రపంచానికి మార్గదర్శకమైన రామయాణాన్ని రచించిన వాల్మీకి మహర్షి అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. గత పాలకులు వాల్మీకులను ఓటు బ్యాంకుగా చూశారే తపాప న్యాయం చేయలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ పార్లమెంట్‌కు బిల్లును పంపారన్నారు. అంతేగాకుండా వాల్మీకులకు మంత్రి పదువులతో పాటు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులను కట్టబెట్టి సమాజంలో ఒక గుర్తింపును కల్పించిన సీఎంకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఎంపీ డా.సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలోనే వాల్మీకులకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్, స్థానిక నాయకులు అద్దుగల రాజశేఖరరెడ్డి, బలరాం, అయ్యప్ప, ప్రతాప్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

- వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను శనివారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కోడుమూరులోని మునిమందలో ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ స్టేట్ కమిటీ సభ్యులు సంధ్యవిక్రమ్‌కుమార్, మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, దాత ఎద్దుల మహేశ్వరరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా వాల్మీకి సంఘం సభ్యులు మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అదేవిధంగా మధ్యాహ్నం అన్నదానం చేశారు.

గూడూరు రూరల్: పట్టణంలోని వాల్మీకి దేవాలయంలో శనివారం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పూజలు నిర్వహించారు. ముందుగా దేవాలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు వాల్మీకి సంఘ పెద్దలు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. అనంతరం దేవాలయంలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గూడూరు నగర పంచాయతీ చైర్మన్ జె వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ ఎల్ వెంకటేశ్వర్లు, నాయకులు అబేలు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాల్లో శనివారం మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, కార్యాలయ సిబ్బంది వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షుడు ముడుమాల మద్దిలేటి, నాయకులు పెద్ద మునెప్ప, రంగన్న తదితరులు వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి ఆయన సేవలను గుర్తు చేశారు. బ్రాహ్మణదొడ్డిలో సర్పంచ్ దస్తగిరి ఆధ్వర్యంలో వీఆర్పీఎస్ నాయకులు రాముడు, నాగరాజు, రంగన్న వెంకన్న, సుంకన్న గ్రామస్తులతో కలిసి వాల్మీకి మహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముడుమాలలో వీఆర్‌పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. కె.సింగవరంలో వీఆర్‌పీఎస్ గ్రామ కమిటీ సభ్యులు నాగన్న, రంగన్న, గోపాల్, పిట్టలన్న, పెద్దన్న, సోమన్న, హనుమన్న ఆధ్వర్యంలో, గుండ్రేవుల గ్రామంలో రామాంజనేయులు, సోమేష్ నాయుడు, శేఖర్, బడేసాబ్, దస్తగిరి, దేవన్న గోకారి ఆధ్వర్యంలో, సంగాలలో మాజీ సర్పంచ్ నాగన్న ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా నాగన్న ఆధ్వర్యంలో సాయంత్రం ఎద్దుల బండిపై మహర్షి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు.



కోడుమూరులో వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి



సి.బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డిలో వాల్మీకి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న వాల్మీకులు



ఆదికవి విగ్రహానికి పూజలు చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, వీఆర్‌పీఎస్ అధ్యక్షుడు మద్దిలేటి



తమ్మరాజుపల్లె నుంచి నంద్యాలకు బైక్ ర్యాలీ

తమ్మరాజుపల్లె యువకుల బైక్‌ర్యాలీ

పాణ్యం: వాల్మీకి జయంతిని పురస్కరించుకుని తమ్మరాజుపల్లె గ్రామ యువకులు నంద్యాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో యువకులు సురేష్, రవికుమార్, మదు, మహేంద్ర, శివక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేయండి



మాట్లాడుతున్న కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు



మాట్లాడుతున్న సి.బెళగల్ తహసీల్దార్ శేషఫణి

కర్నూలు(సిటీ) : మండల పరిధిలోని అన్ని గ్రామాలకు సంబంధించి 2024 ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశామని, దానిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలుపవచ్చునని తహసీల్దార్ శివరాముడు అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ముసాయిదా ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమై మాట్లాడారు. వచ్చే నెల 4,5, డిసెంబర్ 2,3 తేదీల్లో ఓటరు జాబితాలపై అభ్యంతరాలు తెలిపేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని, లేకపోతే దరఖాస్తుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ భాను, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలను సరి చూసుకోండి

సి.బెళగల్: గ్రామాలలో చేపట్టిన ఓటర్ల మార్పు చేర్పుల అనంతరం ప్రచురించిన సంక్షిప్త ఓటరు జాబితాలు బీఎల్వోల దగ్గర ఉందని, ఓటర్లు తమ ఓటు హక్కు వివరాలను సరి చూసుకోవాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్వోలు, రాజకీయ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత జూన్ నెల నుంచి అర్హులైన వారందరికీ ఓటు హక్కును కల్పించడం జరిగిందని, అదేవిధంగా మణించిన, శాశ్వతంగా వలసవెళ్లిన ఓటర్లను తొలగింపు చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం మండలంలో 42,495 మంది ఓటర్లు ఉన్నారని, పురుషులు 21,469, స్త్రీలు 21,023, ఇతరులు ముగ్గురు ఓటర్లు ఉన్నారని తెలిపారు. కొత్తగా మండలంలో ఇప్పటి వరకు 687 మంది ఓటర్లను చేర్చడం జరిగిందని వివరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండ బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాలను సరి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, ఇనగండ్ల సర్పంచ్ ఇమ్మానియేల్, బీఎల్వోలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతన్నకు కూలీల పోటు

- ఆలస్యమవుతున్న పంట కోతలు
- నాణ్యత కోల్పోతున్న పత్తి

కోడుమూరు : ఆరుగాలం కష్టపడి ప్రకృతి వైపరీత్యాలకు ఎదురీది పంట పండించిన రైతు దిగుబడులను ఇంటికి చేర్చుకోడానికి ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ఎన్నడూలేని విధంగా కూలీల కొరత ఏర్పడటంతో రైతు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఏడాది రైతులు ఎక్కువగా పత్తి పంటను సాగు చేశారు. కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల పరిధిలో దాదాపు 38వేల ఎకరాల్లో రైతులు పత్తిపంటను సాగు చేశారు. పత్తికోతలు మొదలవడంతో కూలీలకు బాగా డిమాండ్ పెరిగింది. ఓ వైపు ఉల్లి, వేరుశనగ, మిరప పంటల కోత పనులు ప్రారంభం కావడంతో పత్తి తీయడానికి కూలీలు రావడంలేదు. పత్తి కోతకు రైతులు పోటీపడుతుండటంతో 'కూలి' సైతం పెంచేశారు కూలీలు. సకాలంలో పంట దిగుబడులను ఇంటికి చేర్చుకోవాలన్న ఆత్రుతతో రైతులు అధికంగా కూలీలకు కూలి చెల్లించి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సొంత గ్రామాల్లో కూలీల కొరత రావడంతో ఇతర ప్రాంతాల నుంచి రప్పించుకుంటున్నారు రైతులు. రాకపోకల చార్జీలు సైతం రైతులే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూలీలు దొరకక పోవడంతో కోతలు ఆలస్యమవుతున్నాయి. ఈ ప్రభావం దిగుబడులు తగ్గడం,



సకాలంలో కోత కోయకపోవడంతో విచ్చుకున్న పత్తిమొగ్గలు

నాణ్యతపై ప్రభావం ఎక్కువ పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు పండించిన రైతు దిగుబడులు చేతికొచ్చే సమయంలో కూలీల కొరత కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

నాణ్యతపై భయం...

కూలీల కొరత రైతన్నను ఇబ్బందులకు గురి చేస్తుంది. సరైన సమయంలో పత్తి కోతలు జరగకుంటే నాణ్యత దెబ్బతింటుందనే భయం నెలకొంది. పొలాల్లో పత్తి రాలిపోయి బరువు తగ్గిపోవడం, నాణ్యత పేరుతో వ్యాపారస్తులు ధరను తగ్గిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి క్వింటాం మార్కెట్‌లో రూ.6500 నుంచి రూ.7500 పలుకుతోంది. మొదటి రెండు కోతల్లో పత్తి దిగుబడి తక్కువగా ఉంటుంది. దీంతో కోత కోయడానికి వచ్చే కూలీలు సగటున 15 కేజీల కంటే ఎక్కువ పత్తి తీయలేరు. ఒక్కొక్కరు రోజంతా పత్తితీసే పని చేయాలంటే రూ.300 కూలీ తీసుకుంటున్నారు. క్వింటాం పత్తి తీయాలంటే 6 మంది కూలీలు అవసరమవుతారు. ప్రస్తుతమున్న మార్కెట్ ధర ప్రకారం రూ.6500లకు రైతు పత్తిని అమ్ముకుంటే, 6 మంది కూలీలకు రూ.1800 ఇవ్వగా, రైతుకు రూ.4700 మిగులుతోంది.

సొంతంగానే పత్తి తెంపుకుంటున్నాం



ఎకరాలో ఈ ఏడాది పత్తి సాగు చేశా. కూలీలు దొరకడంలేదు. కూలి రూ.300 ఇస్తామన్నా రావడంలేదు. పక్కగ్రామాల్లోనూ కూలీలు దొరకడం లేదు. తప్పని సరిస్థితుల్లో కుటుంబ సభ్యులమంతా కలిసి పత్తిని తెంపుకుంటున్నాం. నాలుగైదు ఎకరాలు పత్తి సాగుచేసిన రైతులకు కూలీలు దొరకడం లేదు. చాలా ఇబ్బందిగా ఉంది. – వెంకటస్వామి, రైతు

కూలీలకు డిమాండ్ పెరిగింది



రెండెకరాల్లో పత్తి సాగుచేశా. పత్తి ధర మార్కెట్‌లో ఆశాజనకంగా ఉంది. పత్తి పంట కోయడానికి కూలీలు దొరకడం లేదు. దీంతో నష్టపోవాల్సి వస్తుందేమోననే భయం ఉంది. పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఒక్కో కూలీకి రూ.300 నుంచి రూ.350 కూలి ఇస్తామన్నా రావడంలేదు. పక్కా గ్రామం నుంచి కూలీలను పిలుపించుకొని పనులు చేయించుకుంటున్నాం. – మాధవస్వామి, రైతు

ప్రజల ఇంటి ముంగిటకే నాణ్యమైన వైద్యం

- పులకుర్తిలో హెల్త్ క్యాంపును పరిశీలించిన ఎమ్మెల్యే డా.సుధాకర్



పులకుర్తి హెల్త్ క్యాంపులో వృద్ధులకు అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డా.సుధాకర్

కోడుమూరు రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే నాణ్యమైన వైద్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. శనివారం మండలంలోని పులకుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఎమ్మెల్యే డాక్టర్ సందర్శించారు. క్యాంపులో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై డాక్టర్లతో చర్చించడంతో పాటు, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. పులకుర్తిలో జరిగిన హెల్త్ క్యాంపుకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. డాక్టర్లు దాదాపు 400మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, సర్పంచ్ ప్రవీణ్, ఎంపీటీసీ నాగరాజు, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఇమ్మానేయులు, స్థానిక నాయకులు సోమశంకర్‌యాదవ్, నాగేంద్ర, రాముడు, గోపాల్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

కల్లూరు: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారని ఎంపీపీ బోయ శారద అన్నారు. శనివారం సల్కాపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేయించుకునేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా ఎంపీపీ వైద్య శిబిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలున్న వారు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి, నెరవాడ సర్పంచ్ మదన్ గోపాల్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు, స్పెషల్ డాక్టర్లు, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శారద

మహిళలంతా ఆర్థికాభివృద్ధి సాధించాలి

- సెర్ఫ్ సీఈఓ ఇంతియాజ్

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలంతా ఆర్థికాభివృద్ధి సాధించాలని సెర్ఫ్ సీఈఓ ఇంతియాజ్ సూచించారు. శనివారం కోడుమూరులోని స్త్రీశక్తి భవనంలో డీఆర్‌డీఏ–వైకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు 'ఉన్నతి' వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమానికి సెర్ఫ్ సీఈఓ ఇంతియాజ్ ముఖ్య అతిథిగా హాజరై చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ప్రతి మహిళ ఏదో ఒక ఉపాధిని ఎంచుకోవాలని, అప్పుడే కుటుంబాలు ఆర్థికాభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం ఉన్నతి వడ్డీ లేని రుణాల కింద 358 సంఘాలకు చెందిన ఎస్సీ ఎస్టీ మహిళలకు మంజూరైన రూ.4,02,55,000 సెర్ఫ్ సీఈఓ ఇంతియాజ్ అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ వైకేపీ పీడీ సలీంబాషా, ఏపీడీలు శ్రీధర్‌రావు, రహిమాన్, తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఎం పుష్పావతి, పొదుపు సంఘాల మహిళలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఉన్నతి వడ్డీ లేని రుణాల చెక్కు అందజేస్తున్న సెర్ఫ్ సీఈఓ ఇంతియాజ్

వైభవంగా చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు



అమ్మవారికి జ్యోతులను తీసుకెళ్లుతున్న భక్తులు

ఓర్వకల్లు: చల్లగా చూడమ్మా చౌడేశ్వరీదేవి అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. మండల కేంద్రమైన ఓర్వకల్లులో శుక్రవారం రాత్రి చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. స్థానిక తొగట వీర క్షత్రియుల ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున వరకు ఈ ఉత్సవాలు నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి అమ్మవారి ప్రతిమను ఊరేగింపుతో తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి విశిష్ట పూజలు జరిపించి, రక్తతర్పనం గావించారు. తదనంతరం పలువురు భక్తులు జ్యోతులను తలపై పెట్టుకొని నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా కొందరు తొగట వీర క్షత్రియులు ప్రదర్శించిన నందికోల సేవ, ఖడ్గ విన్యాసాలు, డప్పుల శబ్దాలతో పురవీధులు మార్మోగాయి. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పగిడ్యాల మండలం, ఘణపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు బృందం వారు ప్రదర్శించిన డప్పు లయవిన్యాసాలు చూపరులను అలరించాయి.



అలరించిన డప్పు ప్రదర్శనలు

పాణ్యంలో ముగిసిన ఆరోగ్య సురక్ష

- వేలాది మందికి స్వగ్రామాల్లోనే ఉచితంగా వైద్య సేవలు



వైద్య శిబిరంలో ఓపీ తీసుకుంటున్న మహిళలు

పాణ్యం: పేదల ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం పాణ్యం మండలంలో ముగిసింది. గత నెల 30వ తేదీన ఆలమూరు గ్రామంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. నాటి నుంచి ప్రతి రోజు ఒక్కో గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రజలకు, రోగులకు 14 రకాల ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. జబ్బులున్న వారికి వైద్య నిపుణుల ద్వారా చికిత్స అందించారు. మండలంలో మొత్తం 11,712 ఓపీలు నమోదు కాగా ఇందులో 1458 మంది కంటి పరీక్షలు, 2612 మందికి వివిధ ఆరోగ్య పరీక్షలు చేశారు. 121 మందికి మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు రెఫర్ చేశారు. పేదలకు ఆరోగ్య భరోసా కల్పించిన ఈ కార్యక్రమానికి ఊరూరా విశేష స్పందన లభించింది. చివరి రోజు శనివారం తమ్మరాజుపల్లెలో నిర్వహించిన శిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పేదల చెంతకే ప్రభుత్వం కార్పొరేట్ వైద్యాన్ని తీసుకొచ్చిందని ఎంపీడీఓ దస్తగిరి, మండల సచివాలయాల కన్వీనర్ సుమంత్‌రెడ్డి ఈ సందర్భంగా అన్నారు.